
రూపరాంపేటలో శివపార్వతుల కల్యాణం


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



మైదుకూరు: భీమేశ్వరస్వామి మూల విరాట్ ... పట్టణంలో ఊరేగుతున్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ

ప్రతిధ్వనించిన పంచాక్షరి

మహా శివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. అభిషేకాలు.. అన్నదానాలతో ఆలయాలు కళకళలాడాయి. చాలా చోట్ల శివపార్వతుల కల్యాణాలు వేడుకగా జరిగాయి. కొండాకోనల్లో పంచాక్షరి నామం ప్రతిధ్వనించింది. ఆర్టీసీ వారు ఆలయాలకు ప్రత్యేక సర్వీసులను నడిపారు.


ప్రొద్దుటూరు..ప్రత్యేక అలంకరణలో సైకతలింగం


ప్రొద్దుటూరు.. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

అట్లూరు: శ్రీలంకమల్లేశ్వర ఆలయం భక్తులతో హోరెత్తింది. శుక్రవారం తెల్లారుజామునుంచే భక్తులు స్నానపు గుండంలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. వైద్యాధికారులు మెడికల్ క్యాంపు నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

బ్రహ్మంగారిమఠం: లింగాలదిన్నెపల్లె దగ్గర వెలసిన దూదెమ్మ కోనలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు నిర్వాకుడు భూమిరెడ్డి కృష్ణారెడ్డి భజనలు. అన్నదానాలు, నాటికలు ఏర్పాటు చేసారు. రేకలకుంట దగ్గర వెలసిన నీళ్ల శిలా పుణ్యక్షేత్రం వద్ద అన్నదానం నిర్వహించారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు పట్టణంలోని పలు శివాలయాలు భక్తుల శివనామస్మరణలతో మారుమ్రోగాయి. అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అగస్త్యమహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని రంగురంగుల పూలతో అలంకరించారు. ఆలయంలోని కాలక్షేపం మండపంలో గంగాగౌరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన సైకతలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి, శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి, చండీ మాతకు కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమృతేశ్వరస్వామి ఆలయంలోని మరకత లింగేశ్వరునికి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు, నవరత్న లింగానికి కాశీ జలాలతో భక్తులు అభిషేకాలు చేయించారు. అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు చేసి సుందరంగా అలంకరించారు.

హరహర మహాదేవ....

బద్వేలు అర్బన్ : లంకమల అభయారణ్యంలో వెలసిన ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం (లంకమల క్షేత్రం) కు భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రాత్రికి స్వామి వార్లకు కల్యాణం నిర్వహించి, కోనేరులో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నారపురెడ్డిశంకర్‌రెడ్డి భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. బద్వేలు పట్టణంలోని పురాతన శివాలయం అయిన రూపరాంపేట శివానంద స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.


అట్లూరు: లంకమల్లేశ్వర ఆలయ స్నానపు గుండం వద్ద భక్తుల సందడి

ఈశ్వరీదేవి మఠంలో..

బ్రహ్మంగారిమఠం: ఈశ్వరీదేవిమఠంలో శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కళ్యాణం స్థానిక ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉభయదాతలు సుంకు సురేష్ దంపతులు నిర్వహించారు. స్థానిక మఠాధిపతి వీరకుమారస్వామి దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు. ఈకళ్యాణంను తిలకించేందకు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కాశినాయన : మండలంలోని కత్తెరగండ్ల శివాలయం, అక్కంపేట విభూది నాగలింగేశ్వర శివాలయం, గంగన్నపల్లె శివాలయాల్లో వైభవంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొని పునీతులయ్యారు. జ్యోతిక్షేత్రం భక్తులతో పోటెత్తింది. నల్లమల్ల కొండల్లోని బెలూమ్ గుహలో వెలసిన శివలింగాన్ని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అక్కడ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మల్లెంకొండకు పోటెత్తిన భక్తులు

గోపవరం : మండలంలోని మల్లెంకొండ భక్తులతో పోటెత్తింది. ఈ బ్రహ్మోత్సవాలకు కడప జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుండి భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి, దేవదాయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కొండపైన వచ్చిన భక్తులకు చిందుకూరిహనుమంతు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రూరల్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా పూజలు

రాచాయపేటలో వెలసిన పురాతనమైన సోమేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శివలింగానికి అభిషేకం, పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున ఆలయంలో స్వామి వారిని దర్శించి కాయకర్పూరం సమర్పించుకున్నారు.

భక్తి శ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు

మైదుకూరు : మైదుకూరులో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శ్రీపార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు కన్నుల పండువగా కల్యాణోత్సవం వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. కోలాటం, చెక్క భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భీమేశ్వర స్వామికి ఎమ్మెల్యే పూజలు

- మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శ్రీ పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.
- పట్టణంలోని వనిపెంట రోడ్డులో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి స్వామి వారి కల్యాణోత్సవం తిలకించి పూజలు నిర్వహించారు. ఆయన ఆలయ నిర్వాహకుల్లో ఒకరైన మాచనూరు సుబ్బరాయుడు తీర్థ ప్రసాదాలు అందించారు.

వైభవం ... శివపార్వతుల కల్యాణం

కలసపాడు : స్థానిక శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, మహానందిపల్లెలోని వీరాంజనేయస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం పురోహితులు వారణాసివెంకటరమణవరప్రసాద్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

హర హర మహాదేవ శంభోశంకర

చాపాడు: అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు శివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించారు.

నేడు బండలాగుడు పోటీలు..

ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం 2గంటలకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ కిషోర్‌రెడ్డి తెలిపారు.

ఖాజీపేట : మహాశివరాత్రి పర్వదినాన భక్తులు పెద్ద ఎత్తున శివాలయంకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాజీపేట మండలంలోని నాగనాథేశ్వరుని, అగ్రహారంలోని శివాలయం, లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. అగ్రహారంలోని శివాలయంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తోపాటు ఎంపీపీ అబుబకర్ సిద్దిక్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం నాయకుడు జంగిటి శివ పూజల్లో పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న రాజానాయుడు,మస్తాన్

పట్టు వస్త్రాలు సమర్పించిన రాచమల్లు దంపతులు



ప్రొద్దుటూరు : మండలంలోని నంగనూరుపల్లెలో మహాశివరాత్రి సందర్భంగా శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొని పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు.

వీరభద్రస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు



చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామిని మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఆయన సతీమణి ప్రభావతమ్మ దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ జీవై వెంకటసుబ్బారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు.


ప్రొద్దుటూరు శివాలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


కాశినాయన: ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు


అల్లాడుపల్లె కేదారేశ్వరుడు


ఈశ్వరీదేవిమఠంలో పూజా కార్యక్రమంలో మఠాధిపతి

క్లుప్తంగా

మొల్ల పీఠం గౌరవాధ్యక్షుడిగా సుబ్బారావు



బద్వేలు అర్బన్: మొల్ల సాహితీపీఠం గౌరవాధ్యక్షుడిగా బద్వేలుకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు, వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావును నియమించినట్లు ఆ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్బారావు సేవలను సాహితీ పీఠానికి ఉపయోగించుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ నియామకం చేపట్టినట్లు ఆయన తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఎం శ్రీనివాసరావు

పోరుమామిళ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండులో బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం చలివేంద్రం ప్రారంభం చేశారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసులు(ఎస్టీయూ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి), ఎస్ఆర్ఐ రమణ గత 5 సంవత్సరాలుగా కూలింగ్ ఫ్యూరిఫైడ్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, దంతవైద్యులు సునీల్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ పుల్లపనాయుడు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారి వివాదంపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మైదుకూరు రోడ్డులోని కొట్టి హైస్కూల్ రహదారి వివాదంపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య సభ అధ్యక్ష, కార్యదర్శులు బుశెట్టి రాంమోహన్‌రావు, మురికినాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల పక్కనే ఉన్న ఓ ప్రార్థనామందిరం సభ్యులు ఇద్దరు పాఠశాల స్థలం మందిరానికి చెందినదని బ్యానర్ ఏర్పాటు చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పాఠశాల స్థలం కబ్జా అవుతోందని మరికొందరు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటువంటి ప్రచారం వల్ల ఘర్షణలు జరిగే అవకాశం ఉందని, రెవిన్యూ మున్సిపల్, పోలీసుశాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పోలీస్‌స్టేషన్ సందర్శించిన డీఎస్పీ


పోలీస్‌స్టేషన్‌లో మైదుకూరు డీఎస్పీ

పోరుమామిళ్ల: ఇటీవల మైదుకూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లు శుక్రవారం పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్ సందర్శించారు. పోరుమామిళ్ల సర్కిల్ పరిధి గురించి, క్రైమ్ రేటు గురించి, శాంతిభద్రతల గురించి డీఎస్పీ విచారించారు. రాబోవు ఎన్నికల నేపథ్యంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలు పంపిణీ


వినికిడి యంత్రాలను అందిస్తున్న డాక్టర్లు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని జిల్లా బాల సత్వర చికిత్స కేంద్రంలో ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి యంత్రాలను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ వినికిడి లోపం, సమస్యలు ఉన్న 25 మంది విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా వినికిడి యంత్రాలను అందించామన్నారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ బాబు, జిల్లా బాలసత్వర కేంద్రం ఇన్‌చార్జి వాసంతి, డెంటల్ డాక్టర్ అనూష సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్టీసీ గ్యారేజీ ప్రారంభోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప ఆర్టీసీ బస్టాండులో నిర్మించిన నూతన డిపో గ్యారేజీని శనివారం ఉదయం 12 గంటలకు ప్రారంభిస్తున్నామని కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఇతర అధికారులు పాల్గొంటారన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన కమలాపురం బస్టాండును ఉదయం 10.00 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఉమెన్‌వింగ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా వింగ్ చైర్మన్ జయమ్మ మాట్లాడుతూ మహిళలు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు నిరాశా నిస్పృహలకు లోను కాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలన్నారు. మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇలియారాణి మాట్లాడుతూ మహిళలు సమస్యలు ఎదురైనప్పుడు తీసుకోవాలన్సిన జాగ్రత్తలు, మహిళ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. ఎన్జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కేజీ రఘురామిరెడ్డి, సీడీపీఓ సావిత్రమ్మ, ఉమన్ వింగ్ కన్వీనర్ సుజాత, కో చైర్మన్ ప్రమీలదేవి, ఎన్జీఓ అసోసియేషన్ సెక్రటరీ రామసుబ్బయ్య, కోశాధికారి ప్రమీల, వైస్‌ప్రెసిడెంట్ జయంతి కుమారి, సంధ్య, దీప్తి, కృపా, సావిత్రి, దేవమణి, సదాశివయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళా సాధికారితతోనే దేశాభివృద్ధి సాధ్యం

పోరుమామిళ్ల: మహిళలు అన్ని రంగాలలో రాణించినపుడే దేశాభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ శారదమ్మ(వైఎస్సార్‌సీపీ), మాజీ ఎమ్మెల్యే కమలమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని శుక్రవారం స్థానిక ఎస్టీయు ప్రాంతీయ కార్యాలయంలో రీజనల్ కన్వీనర్స్ కృష్ణారెడ్డి, రమణ, మండల అధ్యక్షుడు పుల్లయ్యల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్టీయు రాష్ట్ర అదనపుప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రమణ్యం, చంద్రహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరులో ఆదర్శ మహిళలను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆదర్శ మహిళలకు సన్మానం

ప్రొద్దుటూరు : స్థానిక రోటరీ క్లబ్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదర్శ మహిళలను పోరెడ్డి సుజాత ఫౌండేషన్ సౌజన్యంతో సత్కరించారు. మహిళలకు అన్ని రంగాల్లో ఆత్మస్థైర్యంతో రాణించాలని పలువురు వక్తలు తెలిపారు. ఆదర్శ మహిళలైన మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్‌పర్సన్ వంకదారు కళావతి, ఆదర్శ గృహిణి జోగిరెడ్డి లక్ష్మీదేవి, మహిళా దర్జీ గిడ్డంగి షబానా మహబూబ్, రోటరీ ఐ హాస్పిటల్ స్వీపర్ గడ్డం మార్తమ్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పోరెడ్డి సుజాత ఫౌండేషన్ చైర్మన్ పోరెడ్డి నరసింహారెడ్డి, ఆయన కుమారుడు పోరెడ్డి పదీప్ రెడ్డిని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.రాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి గజ్జల వెంకటేశ్వరరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కోశాధికారి బాలసూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు... సుజాతను సన్మానిస్తున్న దృశ్యం


బద్వేలు ... సభలో సన్మానమందుకున్న అన్నివర్గాల మహిళలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి మంజూరైన రూ.3లక్షల చెక్కులను ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ శుక్రవారం శ్రీరాములపేటలోని తన కార్యాలయంలో ముగ్గురు లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

పార్కులతో ఆహ్లాదకర వాతావరణం

కడప కార్పొరేషన్: పార్కుల నిర్మాణంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి.అంజాద్‌బాషా అన్నారు. నగరంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ పార్కు, రిమ్స్ ఆస్పత్రి వద్ద జర్నలిస్ట్ కాలనీ పార్కును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కడప నగరం సుందరీకరణ భాగంలో అన్ని దిశలా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రూ.60 లక్షలతో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ పార్క్, రూ.1.30 కోట్లతో జర్నలిస్టుల కాలనీ వద్ద పార్కు నిర్మించారన్నారు. వైఎస్.జగన్‌మోహనరెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు.


జర్నలిస్టు కాలనీ పార్కును ప్రారంభిస్తున్న అంజద్‌బాషా

అనంతరం పార్కులోని ఆట వస్తువులను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్.ప్రసాద్ రెడ్డి, త్యాగరాజు, ఎన్. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, బంగారు నాగయ్య, గౌస్, జమాల్‌వలి, రమేష్‌రెడ్డి, అజ్మతుల్లా, ఏ.అలీ, రాకేష్ చంద్ర, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

రేపు పుస్తక పరిచయ సభ

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం వివేక్ లంకమల రూపొందించిన లంకమల దారుల్లో పుస్తక పరిచయ సభ నిర్వహించనున్నారు. పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.